# కుక్కగారి విశ్వాసం

-విశ్వనాథ సాయి శ్రీనివాసశాస్త్రి

చటుక్కున పాపారావు పిక్కందుకొంది కుక్క! అతడు కెవ్వుమని కేక పెట్టాకే ఆ సంగతి తెలిసింది!

నెత్తురుకూడా వస్తోందని ఎవరో అన్నారు. పక్కింటి బామ్మగారు వెంటనే అరిసెలు మాత్రం తినకూడదన్నారు. ఎదురింటి పిన్నిగారు ఎంతో అనుభవంతో చెప్పినట్లు వర్షంలో అస్సలు తడవకూడదన్నారు... అర్జంటుగా హాస్పిటల్‌కి పరిగెడితే బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు చేస్తారు. లేకపోతే ఛస్తాడు... మరో ముసలి గొంతు నాదం స్ఫుటంగా వినబడింది! ఆ వెంటనే వెనుక నుండి మరెవరో చెప్పుతో కొట్టాలి!! అన్నారు. ఏదైనా తప్పకుండా పత్యం పాటించి తీరాల్సిందే అనుకుంటూ పెడబొబ్బలు పెడ్తూ హాస్పిటల్ వైపు భయాందోళనతో పరుగందుకొన్నాడు...

"డాక్టరుగారున్నారు... లోపలికి వెళ్లండి.." గేట్‌మేన్ గేటు తీస్తూ చెప్పాడు.

వాయువేగ, మనోవేగంతో డాక్టర్ని కలిసి... విషయమంతా వివరంగా చెప్పాడు.

ఎంతో నిదానంగా విన్న తర్వాత... కుక్కకాటు వేసిన స్పాట్‌కు ఫస్ట్ ఎయిడ్ చేస్తూనే-

"చూడండీ...! మీకు కాటు వేసినది వీధి కుక్కా.... పెంపుడు కుక్కా.... లేక రెండింటికీ చెందినదా?! ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఏదో చెప్పలేని అయోమయంలో... "ఏమో, మంట మాత్రం ఎక్కువగా వుంది, త్వరగా తగ్గేట్టు ట్రీట్‌మెంట్ చెయ్యండి ప్లీజ్" ప్రాధేయపడ్డాడు.

మరుక్షణమే టెటనస్ ఓ జబ్బుకి... యాంటి రేబిస్ మరో జబ్బుకి పొడుస్తూ "చూడండీ... అదేకుక్కో తెలియదంటే కుదర్దు! దాన్ని మీరు ఓ వారం రోజుల పాటు అబ్జర్వ్ చెయ్యాల్సిందే... దానికేమైనా అయితే మీకు ప్రమాదం... బీ కేర్!"

ఉన్నపళంగా ఆ షాక్‌తో తన ప్రాణం నిజంగా ఎటో పోయినట్లయింది. తన కనుసన్నలలో ఆ కుక్కే మెదలసాగింది! అదే షాక్‌తో "అలాగే సార్!" అంటూ అడిగిన ఫీజుకి అయోమయంలో మరింత ఎక్కువే చెల్లించి అక్కడ్నించి బయట పడ్డాడు.

ఆ దారిలో గేట్‌మేన్ అతన్ని చూస్తూనే- "బాబూ! మీరిలా గొచ్చారేంటి?!" కుశల ప్రశ్నవేశాడు.

"ఎందుకొస్తామయ్యా బాబూ.... కుక్క కరిచింది"

"కొంపదీసి మీకు కరిచింది నల్లకుక్క కాదు కదా?!" తన అనుమానాన్ని రూఢి పరచుకోవడం కోసం అడిగాడు.

"నల్లకుక్క కాక పోవడమేంటీ? అదే నా కొంప ముంచింది. అదంత ప్రమాదమైనదా?!"

"కాదని నేనెలా చెప్పగల్ను? కాకపోతే ఆ నల్ల కుక్కే ఈ మధ్య చాలా మందిని కాటేస్తోంది!

"ఎందుకైనా మంచిది దాన్ని మీరు ఓ కంట కనిపెట్టడం చాలా అవసరం.." ఉచిత సలహా పారేశాడు.

"ఓ కంటేమిటీ, రెండు కళ్లతో... కాదు వెయ్యి కళ్లతో మరీ కనిపెట్టాలి... లేకుంటే నా ప్రాణానికే ముప్పు".

"అవును కదా? ఇక ఆలస్యం చెయ్యకుండా వెళ్లి, దాన్ని పట్టుకునే ప్రయత్నం చెయ్యండి".

"అది సరే గాని... దాని జాడ ఎలా తెలుస్తుందో?!"

"ఓసే... దానికేముందీ? దానికి చపాతి అంటే చాలా ఇష్టమని... అది ఎవరి దగ్గరుంటే వారి దగ్గరకు ఇట్టే చేరిపోతుందని చాలామంది కథలుగా చెప్తుంటారు..."

"సరే... చెప్పారు కదా?" వస్తాను.

"మీదే ఆలస్యం... వెళ్ళిరండి".

****

ఒంటరి పక్షి కావడంతో స్వయంగా చపాతీలు తయారు చెయ్యడం ప్రారంభించాడు.

ఆ వాసనకు ఎక్కడనుండో సైతానులా

వచ్చేసిందో కుక్క! దాని ముఖం పరిశీలించగా... తనకు కాటేసింది ఆ కుక్కేనని దృఢ నిర్ణయానికొచ్చాడు.

మరుక్షణమే ఎవరో పనివాళ్ళు భయంతో వేసిన తన కేక విని అక్కడకు పరుగెత్తు కొచ్చారు! ఆ కుక్కను ఎలాగైనా కట్టేసే ఏర్పాటు చెయ్యమని, బ్రతిమిలాడాడు. అందుకు తగిన తృణమో... పణమో లంచంగా ఇచ్చుకుంటానని కూడా చెప్పాడు.

ఆ అనువు చూసుకొని వాళ్లు మరింత బెట్టు చేస్తూ... "చూడండీ... దాన్ని పట్టుకొని కట్టడమంటే మాటలా? అది పొరపాట్న మమ్మల్ని కరిస్తే... మాగతేంటి?! మీరిచ్చిన సొమ్ముకి బదులు మాకు పదింతలవుద్ది... పైగా మా పేణాలకే ముప్పు...'"

"బాబ్బాబు! మీకు పుణ్యముంటుంది... దాని వల్ల మీకేమయినా జరిగితే నాది పూచి...సరేనా?'

"సరేనా... అంటే ఎలా కుదురుద్ది? మీ మీద మాకు నమ్మకమున్నా ఆ కుక్క మీద నమ్మకం ఎవరికుంటుందీ?!"

"అయితే ఇప్పుడు ననేన్నం చెయ్యమంటారో చెప్పండి?"

"ఏముందీ... నాదీ పూచీ అన్నారు కదా?!"

"అవునూ?!"

"అదేదో... ఓ కాగితం మీద పూచీకత్తు వ్రాసుకుంటే ఎందుకైనా మంచిది... ఏవంటారు?"

"ఏంవంటాను...? అగాగే చేద్దాంలెండి".

"చూద్దాం... చేద్దాం లాంటి మాటలు చాలా దూరమైనవి... ఆ పూచీకత్తేదో త్వరగా రాసియ్యండి లేకపోతే ఆ కుక్క ఎటైనా వెళ్ళిపోద్ది... ఆ తర్వాత మేవేం చెయ్యలేం..."

గబగబ ఓ కాగితం వ్రాసి, దానిపై సంతకం చేసి మరీ అందిచ్చాడు.

మరుక్షణమే ఆ కుక్కను వాళ్ళు ఎలాగో తాడుతో బంధించి, దండిగా కర్రు తీసుకుని మరీ బయల్దేరారు.

వాళ్ళు వెళ్ళిన గంటకుగాని బుర్రకి లైటు వెలగలేదు, వాళ్ళు ఆ కాగితం తిరిగి ఇవ్వకుండా వెళ్ళారని... అది తలచుకుంటే తన గుండె గుభేలు మంది! కారణం నిజానికి కుక్కకరిచింది తనకైతే... వాళ్ళకి కరిచిందని డబ్బుకోసం రివర్స్‌గా వాళ్ళేమయినా కోర్టు కెళితే?!"

తలచుకొంటే మరింత కంవరం పుట్టుకురాసాగింది. వాళ్ళెక్కడైనా కనిపిస్తే పట్టుకుందామని చుట్టూ గాలించాడు. కాని ఇరుపంచాల్లో వాళ్ళ జాడ మాత్రం కన్పించ లేదు. అసలు కుక్క కరిచిన బాధ ఓ ప్రక్కయితే, మరో ప్రక్క ఆ కాగితం బాధ ఒకటి వానికి అడిషనల్‌గా వచ్చి చేరింది... ఛ్ఛ్!

ఆ రాత్రి కంటికి కునుకు లేదు సరికదా, కడుపుకు తిండి కూడా సహించలేదు. తన కళ్ళ ముందే గత సంఘటనలు కొట్టొచ్చినట్టు కనబడ సాగాయి! ఖర్మ సిద్ధాంతాన్ని తప్పించుకోడానికి ఎవరికి సాధ్యం చెప్పండీ...? అందుకే నిట్టూర్చడం

## విజయం వెనుక...

నిరాశా నిస్పృహలు
మర్రి వూడలై విస్తరించినా
ఆశయం అంచు మెరుపైనప్పుడు
ప్రతీ మానూ ఉలిక్కి పడుతుంది.
అది ఉరుమై పిడుగు పడినపుడు
అంతటి వృక్షమూ మోడౌతుంది.

కళ్ళు తెరుచుకుని కన్న కలలు
భావి జీవితపు ఆకాశ హర్మ్యాలు.

ఆత్మ విశ్వాసానికి అంకురార్పణ చేసి
అకుంఠిత దీక్షతో
అలుపెరుగని పోరాటం
సాగించే వీరునికి
అదృష్టం తలుపు తట్టే రోజు
ఒకటి వస్తుంది!

శ్రమైక జీవనం
జీవనదిలా పారితే
విజయమే అతనికి
సస్యశ్యామల ఫలం!!!

**-కొత్తపల్లి ఉదయబాబు**

మొదలెట్టాడు... అదే సమయంలో సావిట్లో కుక్క తాలూకు నిట్టూర్పు రాగం విన్పించడంతో...

ప్రాణభయంతో బయటకెళ్ళి, దాన్ని చూసాడు! అది బాగానే ఉండడంతో తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"... పాపం దొంగముండకు ఆకలి గాబోలు". కరిచినందుకు కసిగా తిట్టుకుంటూనే దానికి కావల్సిన పాలు, ఫలహారాలు సమర్పించుకున్నాడు.

బాగా అవి వంటబట్టినట్టుంది. రాత్రంతా హుషారుగా తన విశ్వాసాన్ని ఒలకబోస్తూ... సైరనులా అరుపులు మొదలెట్టింది!

అలా... రోజూ సుష్టుగా... పుష్టిగా తింటున్నందుకు తన ప్రగాఢ విశ్వాసాన్ని అందరికీ వినపడేలా ప్రకటించడం ఆనవాయితీగా మార్చుకుంది.

ఒకటీ... రెండు రోజులయితే ఫర్వాలేదు... రోజూ ఇదే తంతు అవ్వడంతో... ఈ ప్రక్క... ఆ ప్రక్క వాళ్ళకి కంటికి నిద్ర కరవవ్వడంతో... పాపారావు వ్యవహారం న్యూసెన్స్ కేసు వరకూ వచ్చింది!

ఎలాగైతేనేం... దాన్ని మర్నాడు అక్కడ్నించి పంపించడాన్కి మూకుమ్మడి ఒప్పందం చేసుకోవడంతో తగవు కాస్త సద్దుమణిగి ప్రశాంత వాతావరణం నెలకొంది!

ఈ రోజు రాత్రి కూడా ఎవరికీ ఖచ్చితంగా నిద్ర ఉండదు... కాదు ఉండ కూడదనీ.. సవాలక్షా దేవుళ్ళకు ఉత్తుత్తి మొక్కులు మొక్కుకున్నాడు!

దానివల్ల తన కొంప మునిగిపోయే పరిస్థితి రాదని తలపోస్తూ... డాక్టరు గారు చెప్పిన వారం రోజులు దాన్ని గమనించే కార్యక్రమం ఆ రోజు రాత్రితో పూర్తి కాబోతున్నందుకు లోలోన ఎంతగానో ఆనందించాడు!

కాని దానికి విరుద్ధంగా ప్రకృతి అనుకూలించక పోవడం వల్లనేమో... ఆ రోజు అది కాస్తా అరవడం మాని మూలగడం ప్రారంభించింది... పరిస్థితి ఎక్కడ విషమిస్తుందో నని ఆ రోజంతా కనురెప్పపడకుండా దానికి వేడి పాలు పోసి, దుప్పటీ కప్పి, దాని ప్రక్కనే కూర్చుని జాగారం చేసాడు!

ఎలాగయితేనేం... మర్నాడు ఉదయానికది... హుషారుగా తోకాడిస్తూ లేచి కూర్చుంది!

దాన్ని మళ్లీ బంధ విముక్తురాలని చేయడానికి అక్కడ దగ్గర్లో ఉన్న పని వాళ్ళకి లంచమిచ్చి విడిపించాడు... ఈసారి వచ్చినవాళ్ళు పూచీ పూసెత్తక పోయేసరికి ఎంతో ఆనందించాడు. మరుక్షణంలో ఆ కుక్క చివరి సారిగా తన విశ్వాసాన్ని ప్రకటించడానికి పాపారావు మీదకు ఉరకబోయింది!

ప్రాణభయంతో... ఎలాగయితేనేం దాన్ని విదిలించుకొని... అక్కడ్నించి తిన్నగా హాస్పిటల్‌వైపు దారితీసాడు..!

విషయమంతా తెలిసిన డాక్టర్ – "నేటితో మీకిక ప్రాణభయం లేదు నోటి సర్టిఫికేట్‌తో... తృప్తిగా ఊపిరి పీల్చుకొని, మహదానందంతో... తగిన ఫీజు చెల్లించి బయటపడ్డాడు!

కాస్పేపటికల్లా.... కాలింగ్ బెల్లు మ్రోగడంతో... డాక్టరుగారి దగ్గర చేతులు కట్టుకొని ప్రత్యక్షమయ్యాడు గేట్‌మాన్.

"చూడు... నీకు ఎన్నిసార్లు చెప్పాను? మన కుక్కగారి కున్న విశ్వాసం, మనకీ ఉండొద్దు?! మనం దాన్ని పోషించలేక బయట వదిలి పెట్టినా.... కొన్నాళ్ళు దాన్ని మనం పోషించిన విశ్వాసంతో... అది జనాలను కాటేసి... వాళ్ళు మన దగ్గరకు వచ్చేట్లు చేస్తోంది కదా?!

అలాంటిదానికి మనం కూడా దానిపై ఆ మాత్రం విశ్వాసాన్ని చూపకపోతే ఏం బావుంటుంది చెప్పూ?! అందుకే కనీసం దానికి కావలసిన... ఇష్టమైన పదార్థాలేమిటో చెప్తే నీ సొమ్మేం పోయిందీ?" గట్టిగా మందలించాడు.

"చెప్తూనే ఉన్నాబాబూ..." ఇంకా పెద్దోళ్ళ దగ్గర ఎదురు సమాధానం చెప్తే ఏమంటారోనని కిమన్నకుండా ఊరుకున్నాడు!

నిజానికది డాక్టరుగారి కుక్కే ఈ రకంగా చేస్తోందన్న విషయం పబ్లిక్‌కి ఎలా తెలియదో...

అలాగే ఆ కుక్కని మున్సిపాలిటీ వాళ్ళు బండిలో ఎక్కించుకొని వెళ్ళారన్న సంగతి ఆ డాక్టరుకూ తెలియదు పాపం! ■